జూన్ 2 వరకు వీసీలను నియమించాలి



మాట్లాడుతున్న ఎస్.నాగేశ్వర్‌రావు

ఉస్మానియా యూనివర్సిటీ: వర్సిటీల్లో ఖాళీ అయిన వీసీ పదవులను జూన్ 2 వరకు కొత్త వారిని నియమించాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాగేశ్వర్‌రావు, సుమంత్ మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ తరహా సీఎం రేవంత్‌రెడ్డి కూడా విద్యాశాఖను నిర్లక్ష్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు గడిచిన ఇంత వరకు విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం దారుణమన్నారు. విద్యాసంవత్సరం ఆరంభంలో పాఠశాలు, కళాశాలలు, యూనివర్సిటీలలో వివిధ కోర్సుల్లో ప్రవేశాలు, పరీక్షలు, ఫలితాలు, వివిధ రకాల ఫీజుల నిర్ణయాలు తదితర కీలక సమయంలో విద్యాశాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. ఇలాంటి తరుణంలో రాష్ట్రంలోని పది వర్సిటీలకు పర్మనెంట్ వీసీలను నియమించకుండా వివిధ శాఖల విధులతో నిత్యం తీరిక లేకుండా గడిపే ఐఏఎస్ అధికారులను ఇన్‌చార్జి వీసీలుగా నియమిస్తే కార్యక్రమాల్లో జాప్యం జరిగి విద్యార్థులు నష్టపోతారన్నారు. ఈ సమావేశంలో స్వాతి, ప్రశాంత్, సంతోష్, కార్తీక్, మధు, సురేఖ, ప్రవీణ్, మహేష్, శ్రీకాంత్, బాలు పాల్గొన్నారు.

జీవ వైవిధ్యంపై సందేశాత్మక పెయింటింగ్స్

నగర వ్యాప్తంగా 250 మంది విద్యార్థుల హాజరు





పెయింటింగ్ పోటీల్లో చిన్నారులు

సనత్‌నగర్: చిన్నారులు అద్భుత చిత్రాలతో అమూల్య సందేశాన్ని అందించారు. మానవుడు తాను కూర్చొన్న కొమ్మనే నరుక్కుంటూ పోతున్నాడంటూ ఆ చిన్ని మస్తిష్కాలు హెచ్చరించాయి. ఇకనైనా మేల్కోకపోతే భవిష్యత్ తరాలు ప్రశ్నార్థకం అంటూ ఆ చిట్టి బుర్రలు గీసిన చిత్రాలు స్ఫూర్తిని రగిల్చాయి. పర్యావరణాన్ని నాశనం చేసుకుంటూ ఆకాశానికి నిచ్చెనలు వేసుకుంటూ వెళ్తుండటం మానవ మనుగడకు శ్రేయస్కరం కాదంటూ బొమ్మలతో మేల్కొల్పే ప్రయత్నం చేశారు. అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం దినోత్సవం సందర్భంగా టీజీపీసీబీ (తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి) ఆధ్వర్యంలో సనత్‌నగర్‌లోని ప్రధాన కార్యాలయంలో పెయింటింగ్ పోటీలను నిర్వహించారు. నగరం నలుమూలల నుంచి కదిలివచ్చిన వివిధ పాఠశాలల విద్యార్థులు పర్యావరణం అంశంపై ఆలోచింపజేసే చిత్రాలను గీసి మేధావులను సైతం ఔరా అనిపించారు. దాదాపు 250 మంది విద్యార్థులు పర్యావరణ సంబంధిత అంశాలపై అందమైన చిత్రాలను గీశారు. ముఖ్యంగా మొక్కలు నాటడం ద్వారా భూమిని వివిధ రకాల కాలుష్య ప్రభావం నుంచి కాపాడవచ్చని తమ పెయింటింగ్స్ ద్వారా తెలియజెప్పారు. పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా వాతావరణంలో జరుగుతున్న వికృత మార్పులకు అడ్డుకట్ట వేయవచ్చని చెప్పారు. నీటి సంరక్షణతో పాటు జీవ వైవిధ్య పరిరక్షణపై అనేక చిత్రాలను గీసి ఆకట్టుకున్నారు. విద్యార్థులను మూడు విభాగాలుగా విభజించి నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన చిన్నారులకు జూన్ 5 పర్యావరణ దినోత్సవం రోజున బహుమతులు ప్రదానం చేయడం జరుగుతుందని సీనియర్ సోషల్ సైంటిస్ట్ ప్రసన్నకుమార్ తెలిపారు.

పిల్లల్లో నైపుణ్యాన్ని వెలికితీయాలి

బాలోత్సవం ముగింపు సభలో చొక్కాపు వెంకటరమణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసి వారి అభివృద్ధికి బాటలు వేయాలని ప్రముఖ విద్యావేత్త చొక్కాపు వెంకటరమణ అన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం(ఎస్‌వీకే)లో తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ నుంచి 22వ తేదీ వరకు నిర్వహించిన శిక్షణతరగతుల ముగింపు సమావేశం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వెంకటరమణ మాట్లాడుతూ పిల్లలకు చదువుతోపాటు ఆటపాటల్లో కూడా శిక్షణ ఇచ్చి ప్రతిభను వెలికి తీయడం అభినందనీయమన్నారు. పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచడానికి వేసవికాలం శిక్షణ తరగతులు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. ఎస్‌వీకే ట్రస్ట్ కార్యదర్శి ఎస్.వినయకుమార్ మాట్లాడుతూ పిల్లల జీవితాల్లో వెలుగులు నింపడానికి బాలోత్సవం చేస్తున్న కృషి స్ఫూర్తిదాయకమన్నారు. భవిష్యత్తులో చిన్నారులు ఉత్తమ పౌరులుగా ఎదగడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఎంతగానో అలరించాయి. తెలంగాణ బాలోత్సవం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బాలోత్సవం ఉపాధ్యక్షులు కె.సుజావతి, కోశాధికారి జి.బుచ్చిరెడ్డి, మమత, పద్మ, నవీన్, గోపాల్, భవానీ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ స్నాచర్ల ముఠా అరెస్టు

సనత్‌నగర్: సెల్‌ఫోన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ముఠాను నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ టీమ్ పట్టుకుంది. నేరేడ్‌మెట్‌కు చెందిన కాటెకెల రాజ్ అలియాస్ శివ, తిరుమలగిరికి చెందిన వీడీ వివియన్‌రాజ్, లాల్‌బజార్‌లోని యుగేన్ అలెక్స్, నర్పత్‌సింగ్, మల్కాజిగిరికి చెందిన సిరిగిరి రాజ్‌కుమార్‌లతో పాటు మరో నలుగురు మైనర్లు జల్సాలకు అలవాటుపడి ఈజీగా డబ్బు సంపాదించేందుకు సెల్‌ఫోన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారు. ఇటీవల ఈ బృందం కొన్ని ప్రాంతాల్లో సెల్‌ఫోన్ స్నాచింగ్‌లకు పాల్పడింది. వీరిపై తిరుమలగిరి, మార్కెట్, నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ల పరిధిలో మూడు కేసులు నమోదయ్యాయి. విశ్వసనీయ సమాచారం మేరకు నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఎస్ఐలు శ్రీనివాసులు దాసు, అశోక్‌రెడ్డి, జ్ఞానదీప్‌లు నిశితంగా ట్రాక్ చేసి నిందితులను పట్టుకున్నారు. రోడ్లపై ఒంటరిగా ఫోన్ మాట్లాడుతూ వెళ్లేవారు జాగ్రత్తగా ఉండాలని నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మీ పెరుమాళ్ సూచించారు. మొబైల్ షాపు యజమానులు బిల్లులు లేకుండా సెల్‌ఫోన్లను కొనుగోలు చేయవద్దన్నారు.

పోలీస్ స్టేషన్‌లో భయం.. భయం!

శిథిలావస్థలో చిలకలగూడ ఠాణా

- పెచ్చులూడుతున్న పైకప్పులు
- బీటలువారుతున్న గోడలు
- భయం గుప్పిట్లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది
- ప్రతిపాదనలకు పరిమితమైన నూతన భవన నిర్మాణం





పిల్లర్లకు పగుళ్లు వచ్చిన దృశ్యం

చిలకలగూడ: ఈస్ట్‌జోన్ పరిధిలోని చిలకలగూడ ఠాణా భవనం శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారింది. సెల్లార్‌తో పాటు పిల్లర్లు, స్లాబులు, కిటికీలు పెచ్చులూడి ఎప్పుడు కూలుతుందోనని భయంభయంగా విధులు నిర్వర్తిస్తున్నారు. వెలిసిపోయిన రంగులతో బయట నుంచి చూస్తే భూత్ బంగ్లా తలపిస్తోంది. శిథిలా భవనాన్ని తక్షణమే ఖాళీ చేయాలని సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులు పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ ప్రత్యామ్నాయం లేకపోవడంతో అదే భవనంలో ఠాణా కొనసాగడం గమనార్హం. సీఐ, ఎస్ఐలు, వందకు పైగా సిబ్బంది ఠాణాలో విధులు నిర్వహిస్తుంటారు. ఫిర్యాదుదారులతో పాటు వివిధ కారణాలు, సమస్యలతో ఠాణాకు వచ్చేవారు మరో రెండు వందల మంది ఉంటారు. ప్రమాదం సంభవిస్తే తీవ్రమైన ప్రాణనష్టం జరిగే అవకాశం ఎక్కువగా ఉంది. అనునిత్యం బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నామని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. ఏ క్షణం ఏమి జరుగుతుందోననే భయంతో తాను ఇటీవలే జీవితబీమా పాలసీ (ఇన్సూరెన్స్) చేయించుకున్నానని ఓ హోంగార్డు చెప్పడం ఇక్కడ విధులు నిర్వహించే సిబ్బంది భయాందోళనకు పరాకాష్టగా చెప్పుకోవచ్చు.

శిథిలావస్థకు కారణాలివే..

మూడు దశాబ్దాలే అయినప్పటికీ శిథిలావస్థకు చేరడంలో పలు అంశాలు దోహదపడినట్లు ఇంజినీరింగ్, నిర్మాణ రంగ నిపుణులు భావిస్తున్నారు. పూడుకుపోయిన చెరువు స్థలంలో ఠాణా భవనం నిర్మించడం, భవనానికి ఆనుకుని నాలా ప్రవహించడం, వరదనీరు నాలాలోకే చేరడం, సాయిల్ టెస్ట్ ప్రక్రియ చేపట్టకుండానే భవనాన్ని నిర్మించడంతో భూమి నుంచి ఉత్పత్తి అయిన కాలుష్యంతో పిల్లరు దృఢత్వాన్ని కోల్పోయినట్లు నిపుణుల పరిశీలనలో స్పష్టమైంది.

పదేళ్ల క్రితం పైపై మెరుగులు..

రహదారిలో రాఘవేంద్ర టిఫిన్స్‌కు ఎదురుగా 1981లో ఏర్పాటు చేసిన ఠాణా భవనం చిన్నదిగా ఉండడంతో మూడు దశాబ్దాల క్రితం శ్రీదేవి థియేటర్ సమీపంలో 400 గజాల స్థలంలో రెండస్తుల్లో భవనాన్ని నిర్మించారు. ఇప్పటి వరకు 28 మంది స్టేషన్ హౌస్ ఆఫీసర్లు (ఎస్‌హెచ్‌ఓ)లు ఇక్కడ పనిచేశారు. తెలంగాణ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో లక్షలాది రూపాయల వ్యయంతో శిథిలావస్థకు చేరిన భవనానికి పైపై మెరుగులు దిద్దారు. 2015 అక్టోబర్ 16 తేదీన రెనోవేటెడ్ బిల్డింగ్‌ను అప్పటి సీపీ మహేందర్‌రెడ్డి, అడిషనల్ సీపీ అంజనీ కుమార్ ప్రారంభించారు.



బీటలు వారి ఇలా..

ప్రమాదం జరగక ముందే స్పందించాలి..

నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమైంది. ఖాళీగా ఉన్న చిలకలగూడ మున్సిపల్ మైదానంలోని కొంతభాగంలో నూతన ఠాణా భవన నిర్మాణానికి కొంత మేర కృషి జరిగింది. జీహెచ్ఎంసీ, రెవెన్యూ శాఖల నుంచి అవసరమైన అనుమతులు లభించకపోవడంతో ప్రతిపాదనలు బుట్టదాఖలాలు అయ్యాయి. త్వరలో వర్షాకాలం ప్రారంభం అవుతోంది. గోడలు తడిసి కూలిపోయే ప్రమాదం ఉంది. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన భవనం ప్రమాదం జరగక ముందే అప్రమత్తమవ్వాలని స్థానికులతో పాటు పోలీస్ సిబ్బంది కోరుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు




సనత్‌నగర్: ఐడీపీఎల్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్ మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12.30 వరకు హెచ్‌పీ రోడ్డు, లక్ష్మీకళ థియేటర్ ఎదురు ప్రాంతం, శ్రీరాములు థియేటర్ ఏరియా, అశ్వని హెయిర్ ఆయిల్ లేన్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

నేడు చండీహోమం

సనత్‌నగర్: వైశాఖ మాసం శుద్ధ పౌర్ణమి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం ప్రాంగణంలోని దుర్గామాత ఆలయంలో గురువారం ఉదయం 9 గంటలకు చండీహోమం నిర్వహించనున్నట్లు ఈఓ శ్రీనివాసరాజు తెలిపారు. అంతక ముందు ఉదయం 6 గంటలకు శ్రీదుర్గామాత అమ్మవారికి 108 మంది ముత్తయిదువులు, 108 కలశములు, సుగంధ ద్రవ్యాలతో 108 లీటర్ల క్షీరంతో అభిషేకం జరుగుతుందన్నారు. అలాగే శ్రీజ్ఞాన సరస్వతీ దేవీ ఆలయంలో సాయంత్రం 5 గంటలకు అమ్మవారికి లలితా సహస్రనామాలతో లక్ష పుష్పార్చన ఉంటుందన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు



సనత్‌నగర్: టమాటా రూ.27, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 50, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 38, పందిరి బీర 35, క్యాబేజీ 16, క్యారెట్ 40, దొండ 45, గుండుబీన్స్ 165, గింజ చిక్కుడు 70, గోకరకాయ 40, కీర 18, దోసకాయ 23, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 23, ఆలుగడ్డ 31, చామగడ్డ 43, మొరంగడ్డ 28, కందగడ్డ 55, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3-4, ముల్లంగి 4-5. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

ఓయూకి మాల ప్రొఫెసర్‌ను వీసీగా నియమించాలి



భాగ్యరెడ్డివర్మ జయంతిలో పాల్గొన్న విద్యార్థి నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూకు మాల కులానికి చెందిన ప్రొఫెసర్‌ను వీసీగా నియమించాలని ఆల్ మాల స్టూడెంట్ అసోసియేషన్ (అంసా) అధ్యక్షులు నామ సైదులు డిమాండ్ చేశారు. నిజాం నవాబ్ పాలనలో విద్యాశాఖ మంత్రిగా పని చేసిన మాలకులానికి చెందిన భాగ్యరెడ్డివర్మ 136వ జయంతిని బుధవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట నిర్వహించారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ.. భాగ్యరెడ్డివర్మ విద్యావ్యాప్తిగా చేసిన కృషి మరువలేనిదని అన్ని సామాజిక వర్గాలతో కలిసి చేసే తత్వం గల మాలలకు ఓయూ వీసీ పదవీ ఇవ్వాలన్నారు. తెలంగాణ మాల మహానాడుతో పాటు ఇతర మాల సంఘాల మద్దతుతో గత అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ ఓయూకు మాల ప్రొఫెసర్‌ను వీసీగా నియమిస్తుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. వివిధ విద్యార్థి సంఘాల నాయకులు ఎన్ఎం శ్రీకాంత్‌యాదవ్, ఉదయ్, గోపి, బసవరాజు, శ్రీను, దామోదర్ పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్: శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉంటూ సుఖ సంతోషాలతో జీవించాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆకాంక్షించారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి జయంతి సందర్భంగా రాంగోపాల్‌పేట డివిజన్ జీరాలోని పురాతన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. పూజల అనంతరం నిర్వాహకులు సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట రాంగోపాల్‌పేట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, ఆలయ నిర్వాహకులు నరసింహ పాల్గొన్నారు.

పాతకక్షలతో దాడి.. ఇద్దరికి గాయాలు

కాచిగూడ: పాతకక్షలతో దాడిచేసి ఇద్దరిని గాయపర్చిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... యాకత్‌పురకు చెందిన ఎండీ ఫయాజ్‌ఖాన్, అతని స్నేహితుడు మొసిన్ బుధవారం డబీర్‌పుర రైల్వేస్టేషన్‌లో ఉండగా వారిపై దావూద్ బాబ్రి(26), రహ్మాన్(25) కత్తులతో దాడి చేసి గాయపర్చారు. వీరిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పాతకక్షలతోనే దాడి జరిగినట్లు పోలీసులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

కాచిగూడ: రైల్లోంచి దూకి గాయపడిన బాలిక చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన బుధవారం కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... కాచిగూడ రైల్వేస్టేషన్‌లో రాజ్‌మొహల్లాకు చెందిన రమేష్ తన ఇద్దరు కూతుళ్లు పూజ(15), విజయ(14), కుమారుడు, సోదరుడి మనవరాళ్లతో కలిసి రైలు ఎక్కే క్రమంలో రమేష్ కింద పడిపోయాడు. తండ్రి పడిపోవడంతో కూతుళ్లు నడుస్తున్న ఎంఎంటీఎస్ రైలు నుంచి కిందకు దూకారు. దీంతో పూజకుడి చెయ్యి విరిగిపోయింది. విజయ తలకు బలమైన గాయంతో పాటు వెన్నముక విరిగిపోవడంతో చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ విజయ మృతి చెందింది.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

లాలాపేట: ఆటో కార్మికుల కోసం ప్రత్యేకంగా సంక్షేమ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు బెజ్జాల కృష్ణమూర్తి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం తార్నాకలో చౌరస్తాలో ఆటో డ్రైవర్లతో కలిసి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన సంక్షేమ బోర్డు, ఆటో డ్రైవర్‌కు రూ. 12,500 ఇస్తామని ప్రభుత్వం ఏర్పాటై వంద రోజులైనా దాని ఊసే లేదన్నారు. ఆటో డ్రైవర్ల సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయని దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. సురేష్, శ్రీనివాస్, అలీమ్ , షరీఫ్ పాల్గొన్నారు.

దేవాలయానికి డస్ట్‌బిన్ల అందజేత



డస్ట్‌బిన్లు అందజేసిన క్లబ్ ప్రతినిధులు

అమీర్‌పేట: వాసవి క్లబ్ అమీర్‌పేట ఆధ్వర్యంలో బల్కంపేట ఎల్లమ్మ దేవాలయానికి 11 డస్ట్‌బిన్లు, ఓ ట్రాలీని వీసీఐ డిస్ట్రిక్ట్ ఇన్‌చార్జి తోట భిక్షపతి సమక్షంలో బుధవారం ఆలయ అధికారులకు అందజేశారు. శ్రీనివాస్‌గుప్తా, నాగభూషణం, బాలాజీ, ప్రవీణ్, సతీష్, మురారి శెట్టి శ్రవణ్ కుమార్, కిరణ్ పాల్గొన్నారు.

శీతల పానీయాల పంపిణీ



చిన్నారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్న ఆకారం రమేష్

చిలకలగూడ: సీతాఫల్‌మండి మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ నాయకుడు ఆదం విజయ్‌కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని చిలకలగూడ మైలార్‌గడ్డకు చెందిన సామాజిక కార్యకర్త ఆకారం రమేష్ బుధవారం సీతాఫల్‌మండి డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో వృద్ధులు, చిన్నారులకు శీతల పానీయాలు పంపిణీ చేశారు. దూద్‌బావి పాఠశాల చిన్నారి విద్యార్థులకు పండ్లు, బ్రెడ్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించారు.

బాలుడి చేరదీత

చిలకలగూడ: ఇంట్లో చెప్పకుండా వచ్చిన బాలుడిని చేరదీసిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్)ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చైల్డ్ రెస్క్యూ 'నన్హేఫరిస్తే' కార్యక్రమంలో భాగంగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా పదో నంబరు ప్లాట్‌ఫామ్‌పై అనుమానాస్పదంగా తచ్చాడుతున్న రోహిత్(8)ను గుర్తించారు. ఇంట్లో చెప్పకుండా వచ్చేసానని చెప్పడంతో మైనర్ బాలుడిని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ నేతృత్వంలో ఆశ్రిత హోమ్‌కు తరలించారు. ఆపరేషన్ నన్హేఫరిస్తేలో భాగంగా ఈ ఏడాది ఇప్పటి వరకు తప్పిపోయి, ఇంటి నుంచి పారిపోయిన 59 మంది చిన్నారులను కుటుంబ సభ్యుల వద్దకు చేర్చామని ఆర్‌పీఎఫ్ ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపారు. ఉమెన్ కానిస్టేబుళ్లు వైశాలి, జ్యోతి పాల్గొన్నారు.

మర్చిపోయిన సెల్‌ఫోన్ అందజేత

చిలకలగూడ: మర్చిపోయిన సెల్‌ఫోన్‌ను యజమానికి అప్పగించిన ఘటన సికింద్రాబాద్ ఆర్‌పీఎఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ 4వ ప్లాట్‌ఫామ్‌లో బుధవారం తనిఖీలు నిర్వహిస్తుండగా రూ. 22 వేల విలువగల ఓ సెల్‌ఫోన్ దొరికింది. సాంకేతిక ఆధారాలతో యజమాని హైదరాబాద్‌కు చెందిన ఫణీందర్‌గా గుర్తించి ఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ రాములు అందించారు. ఈ ఏడాది సికింద్రాబాద్ ఆర్‌పీఎఫ్ పరిధిలో జరిగిన సుమారు వంద ఘటనల్లో రూ.13,63,570 విలువగల వస్తువులను యజమానులకు అప్పగించామని ఆర్పీఎఫ్ పోలీసులు తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

అమీర్‌పేట: తాగుడుకు బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి వివరాల ప్రకారం.. అమీర్‌పేట ఈస్ట్ శ్రీనివాస్ నగర్ కాలనీలో ఉండే షర్ఫోద్దీన్ (41)కు పదేళ్ల క్రితం వివాహం కాగా కొన్ని కారణాలతో భార్య పుట్టింటికి వెళ్లిపోగా షర్ఫోద్దీన్ తల్లిదండ్రుల వద్దే ఉంటున్నాడు. తాగుడుకు అలవాటు పడటంతో అనారోగ్య బారిన పడ్డాడు. మంగళవారం అర్ధరాత్రి ఇంటి మెట్ల పక్కన ఉన్న సిమెంట్ దిమ్మెకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. తన చావుకు ఎవరూ కారణం కాదని..జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సూసైడ్ నోట్‌లో రాసి ఉంది.

అధికారుల నిర్లక్ష్యం.. అసాంఘిక కార్యకలాపాలకు నిలయం



విరిగిన ప్రవేశ ద్వారం

ఉస్మానియా యూనివర్సిటీ: అధికారుల నిర్లక్ష్యంతో ఓయూ క్యాంపస్‌లోని ఉద్యానాలు అధ్వానంగా, అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారుతున్నాయి. అందమైన పువ్వులు, వివిధ రకాల మొక్కలతో సుందరంగా కనిపించే గార్డెన్లు విరిగిన గేట్లు, తిరిగిన బోర్డులతో కళావిహీనంగా మారుతున్నాయి. సిబ్బంది కొరతతో వర్సిటీలోని గార్డెన్లు నిరుపయోగమై రాత్రుల్లో బయటి వ్యక్తుల అశ్లీల కృత్యాలకు నిలయంగా మారుతున్నాయి. విద్యార్థులు సేద తీరేందుకు క్యాంపస్‌లోని న్యాయ కళాశాల ఎదుట ల్యాండ్ స్కేప్ గార్డెన్‌ను ప్రత్యేకంగా నిర్మించారు. చిన్నలేక్‌తో సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ గార్డెన్ క్యాంపస్‌లోనే పెద్దది. దీని నిర్వహణ కోసం గతంలో 25 మంది సిబ్బంది ఉండగా ప్రస్తుతం కేవలం 12 మంది మాత్రమే పని చేస్తున్నారు. ఇది వరకు బయటి వ్యక్తులు ప్రవేశించకుండా పగలు, రాత్రి 24 గంటలు వాచ్‌మెన్ కాపాల ఉండేవారు. సిబ్బంది కొరతతో వాచ్‌మెన్లను తొలగించడతో బయటి వ్యక్తులు వచ్చి సిబ్బంది హట్‌లో అసాంఘిక కార్యక్రమాలు జరుపుతున్నట్లు సమాచారం. గార్డెన్ల నిర్వహణపై దృష్టి సారించి బయటి వ్యక్తులు రాకుండా వాచ్‌మెన్లను నియమించాలని విద్యార్థి నేతలు అధికారులను డిమాండ్ చేస్తున్నారు.



విరిగిన బోర్డు